సాక్షి
పార్వతీపురం మన్యం
మంగళవారం । 25 । మార్చి । 2025



కూటమి నాయకుల గలాటా

కూటమి నాయకుల నక్కజిత్తుల ఎత్తులతో పాలకొండ మండల సర్వసభ్య సమావేశం సోమవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. - 8లో



మూడు రిజిస్ట్రేషన్లు..ఆరు స్టాంపులు..!

అఫిడవిట్‌లతో పాటు అనేక రకాలైన చట్టపరమైన ఒప్పందాలకు ప్రధాన ఆధారమైన నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పత్రాల విక్రయాల్లో దోపిడీ పెరిగింది. - 8లో



ఇఫ్తార్	సహార్
మంగళ (సా)	బుధ (ఉ)
6.12	4.46

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

26న ఇ-అడ్వాన్స్ టెండర్లు

సీతంపేట: ఇ-అడ్వాన్స్ టెండర్లను ఈనెల 26న నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వేల కొండచీపుర్లు, 100 క్వింటాళ్ల కుంకుడు, 100 క్వింటాళ్ల పసుపు కొమ్ముల విక్రయానికి టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. వివరాలకు జీసీసీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

గవరమ్మపేటలో ఏనుగుల గుంపు



గవరమ్మపేట ప్రధాన రోడ్డుపై ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, వెంకటరాజపురం పంట పొలాల్లో సోమవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. వెంకటరాజపురంలోని బంటు అప్పలనాయుడు, దత్తి వెంకటనాయుడు, బంటు గౌరునాయుడుకు చెందిన జొన్న, అరటి తోటలు ధ్వంసం చేశాయి. ప్రభుత్వం స్పందించి తక్షణమే నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

పకడ్బందీగా ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విజయనగరం అర్బన్: జిల్లాలో మంగళ, బుధవారాల్లో జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సోమవారం సమావేశమయ్యారు. 25న అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, 25, 26వ తేదీల్లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో అనలిస్ట్ గ్రేడ్-2 ఉద్యోగాలకు, 26న డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్ ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. జిల్లాలో ఎంవీజీఆర్ కళాశాల, అయాన్ డిజిటల్, లెండి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్‌ఈ లక్ష్మణరావు, పరీక్షల సూపరింటెండెంట్ భాస్కరరావు, ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ ఎం.బాలరాజు, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, వైద్య కళాశాల్లో స్పీచ్ థెరపిస్టు, ఓటీ టెక్నీషియన్, డెంటల్ టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా వెబ్ సైట్‌లో పెట్టామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల సోమవారం తెలిపారు. అభ్యంతరాలుంటే వైద్య కళాశాలలో ఏప్రిల్ ఒకటో తేదీలోగా లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

కూటమి బరి తెగింపు!



జేసీ శోభికకు అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేస్తున్న పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర, నాయకులు

- పార్వతీపురం మున్సిపల్ చైర్ పర్సన్ పీఠంపై ఎమ్మెల్యే కన్ను
- భయపెట్టి.. ప్రలోభపెట్టి కౌన్సిలర్లకు ఎర
- ఇంటి స్థలం, రూ.10 లక్షలకు బేరమంటూ ప్రచారం
- అధికార దర్పంతో అడ్డదారులు
- జేసీ శోభికకు అవిశ్వాస తీర్మానం నోటీసు

సాక్షి, పార్వతీపురం మన్యం:

కూటమి నాయకులు బరి తెగించారు. అధికార దర్పంతో అడ్డదారులు తొక్కారు. అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి పార్వతీపురం మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లే లక్ష్యంగా ప్రలోభాల పర్వానికి దిగి.. నయానో భయానో తమ దారిలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నాలు సాగించారు. సంఖ్యాబలం లేకపోయినప్పటికీ, మున్సిపల్ చైర్‌పర్సన్ కుర్చీపై కన్నేసిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర... దానిపై తమవారిని కూర్చోబెట్టేందుకు అన్ని దారులూ వెతికారు. ఒక్కొక్కరినీ తమ పార్టీల్లోకి లాక్కొన్నారు. చివరిగా సోమవారం ఉదయం మరో ఇద్దరిని కలిపేసుకుని, సాయంత్రం ఆగమేఘాలపై జేసీ ఎస్.ఎస్.శోభికను కలిసి అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేశారు. కొద్దిరోజుల కిందట పాలకొండ చైర్‌పర్సన్ పీఠాన్ని దక్కించుకునేందుకు అస్త్రశస్త్రాలన్నీ ఉపయోగించారు. స్వయంగా కూటమి పార్టీ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బరిలో దిగారు. అయినప్పటికీ..పాలకొండ నగర పంచాయతీకి చెందిన కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీ పట్ల తమ విశ్వాసాన్ని చూపుకొన్నారు. ఎన్ని ప్రలోభాలకు పాల్పడినా వెరవలేదు. దీంతో కూటమి ఎత్తులు చిత్తయ్యాయి.

విశ్వాసంపై నీళ్లు చల్లి.. అవిశ్వాసం

పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో 30 వార్డులు ఉన్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా 18వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బోను గౌరీశ్వరి కొనసాగుతున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కేవలం ఐదు స్థానాల్లోనే టీడీపీ అభ్యర్థులను ఓటర్లు గెలిపించారు. బీజేపీ ఒక స్థానం, ఇద్దరు స్వతంత్రులు ఎన్నికల బరిలో గెలవగా.. 22 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసింది. ఇందులో 10, 19, 26వ వార్డులను అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఏకగ్రీవం చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. స్థానిక ఎమ్మెల్యే విజయచంద్ర వైఎస్సార్‌సీపీ, ఇండిపెండెంట్ కౌన్సిలర్లే లక్ష్యంగా.. ప్రలోభాలకు తెర తీశారు. అధికారంలో వచ్చిన తర్వాత ఇద్దరు స్వతంత్రులు, ఒక బీజేపీ కౌన్సిలర్, పదిమంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను టీడీపీలోకి చేర్చుకున్నారు. తాజాగా ఒకటో వార్డు స్వతంత్ర కౌన్సిలర్ ఆర్.శివకుమార్ (బంగారునాయుడు), వైఎస్సార్‌సీపీకి చెందిన 30వ వార్డు కౌన్సిలర్ రణభేరి చిన్నంనాయుడును టీడీపీలో చేర్చుకున్నారు. వాస్తవానికి ఒకటో వార్డు కౌన్సిలరు శివకుమార్ గెలిచిన వెంటనే బీజేపీలోకి జంప్ అయ్యారు. తర్వాత వైఎస్సార్‌సీపీలోకి, అనంతరం టీడీపీలోకి గోడ దూకారు. మరలా కొద్దిరోజుల తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరగా.. తాజాగా మరోసారి పార్టీ మారి, టీడీపీ కండువా కప్పుకున్నారు.



పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం

కూటమిది అడ్డదారి!

తమ దారి అడ్డదారి అని కూటమి నాయకులు మరోసారి నిరూపించుకున్నారు. ఓటర్లు, ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా బీజేపీ, స్వతంత్రులు, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి తమ పార్టీలో కలుపుకున్నారు. దీంతో కూటమి బలం 18కి చేరింది. ఎప్పటి నుంచో చైర్‌పర్సన్ కుర్చీపై తమ వారిని కూర్చోబెట్టేందుకు తహతహలాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర.. నిమిషమైనా ఆలస్యం చేయకుండా సోమవారం సాయంత్రమే జేసీ శోభికను కలసి అవిశ్వాస తీర్మానం నోటీసు దగ్గరుండి అందజేశారు. వాస్తవానికి వైఎస్సార్‌సీపీ బీఫారంతో గెలిచిన పలువురు కౌన్సిలర్లు.. గత ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది మొదలు వెన్నుపోటు రాజకీయాలకు తెరతీశారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నేపథ్యంలో పలువురిపై వైఎస్సార్‌సీపీ సస్పెన్షన్ వేటు కూడా వేసింది.

ప్రలోభాలు.. బెదిరింపులు

పార్టీ మారకపోతే వార్డుల్లో ఏ పనీ చేయనీయబోమని పలువురిని కూటమి నాయకులు బెదిరించినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులయ్యారన్న కారణంతో పలువురు చిరుద్యోగులను విధుల నుంచి తప్పించారు. ఇతర పనులేవీ మంజూరు చేయనీయమంటూ పలువురు కౌన్సిలర్లకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతోపాటు... పలువురికి ఇంటి స్థలం, రూ. 10 లక్షలు ఇస్తామన్న ఆశ చూపి టీడీపీలోకి చేర్చుకున్నారన్న ప్రచారం పట్టణంలో జోరుగా సాగుతోంది. భయపెట్టి, బెదిరించి, ప్రలోభపెట్టి ఫిరాయింపులను ప్రోత్సహించారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో పార్వతీపురం పురపాలక సంఘ పరిధిలో గానీ.. నియోజకవర్గంలో గానీ చేసిన అభివృద్ధి అంటూ ఏదీ లేదు. ఉన్న ఉద్యోగాలను తీసివేయడమే గానీ.. కొత్తగా ఒకరిని నియమించింది లేదు. నియోజకవర్గంలో అభివృద్ధిని పూర్తిగా పక్కనపెట్టేసి.. ఫిరాయింపులపైనే స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించారన్న విమర్శలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఫిరాయింపుల నేపథ్యంలో టీడీపీ అవిశ్వాస తీర్మానం నోటీసు అందజేసింది.



ఫలితంగా వైఎస్సార్‌సీపీకి కోరం తక్కువవుతుంది. సంఖ్యాబలం చూసుకుని, చైర్ పర్సన్ సీటు కోసం కూటమి ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. ఇదే కూటమి ప్రభుత్వం ఎత్తుగడగా కనిపిస్తోంది. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా నడుస్తున్న కౌన్సిలర్లపై స్థానిక ఓటర్లు ఇప్పటికే మండిపడుతున్నారు. ఒక పార్టీ గుర్తుతో గెలిచి మరో పార్టీలో కలిసి వెన్నుపోటు రాజకీయాలకు తెర తీయడంపై గుర్రుమంటున్నారు. తిరిగి మాతృ పార్టీకి వస్తారా.. లేదంటే విశ్వాసాన్ని విడిచిపెట్టి అవిశ్వాస తీర్మానానికి అనుగుణంగా ముందుకు సాగుతారా అన్న చర్చ పట్టణవాసుల్లో సాగుతోంది.



ఎం.రాజపురంలో ఈదురు గాలులకు నేలమట్టమైన అరటి పంట

పంటలు వర్షార్పణం

పార్వతీపురం మన్యం జిల్లాలోని పలు ప్రాంతా ల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం 5 గంటల వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతా ల జలమయమయ్యాయి. అరటి, జీడిమామిడి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. నువ్వుపంట నేలమట్టమైంది. నూర్పిడిచేసి కళ్లాల్లో ఉంచిన ధాన్యం బస్తాలు తడిసిముద్దయ్యాయి. వీరఘ ట్టం మండలంలోని వీరఘట్టం, దశుమంతపురం, చలివేంద్రి, చిట్టపులివలస, కంబర, నడిమికెల్ల, విక్రమపురం, నడుకూరు గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో అరటి తోటలు, 250 ఎకరాల్లో జీడిమామిడి తోటలు ధ్వంసమయ్యాయని, సుమారు రూ.50 లక్షల పంట నష్టం జరిగినట్టు రైతులు చెబుతున్నారు. పంటల నష్టం అంచనా వేస్తామ ని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపా రు. వేసవి దుక్కులకు వర్షం ఉపకరిస్తుందని పలువురు రైతులు పేర్కొన్నారు.

– వీరఘట్టం/గుమ్మలక్ష్మీపురం/రేగిడి



రేగిడి: అంబకండిలో పూత దశలో నేలకొరిగిన నువ్వు చేను



వీరఘట్టం సమీపంలో పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు



శ్యాంపురం సమీపంలో ప్రధాన రోడ్డుపై ఆరబెట్టిన మొక్కజొన్నపిక్కలు



గుమ్మలక్ష్మీపురంలో పొలంలో చేరిన వర్షపు నీరు



వీరఘట్టం హైస్కూల్ గ్రౌండ్‌లో చేరిన వర్షపు నీరు

బెట్టింగ్స్‌పై ఉక్కుపాదం

- ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి



పార్వతీపురం రూరల్: క్రికెట్ బెట్టింగ్స్‌కు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, బెట్టింగ్‌లకు పాల్పడిన, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి హెచ్చరించారు. తన కార్యాలయంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాల వలలో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని యువతకు హితవుపలికారు. బెట్టింగ్స్ పెను భూతం వంటివని, ఆశచూపి అథఃపాతాళానికి నెట్టివేస్తాయన్నారు. డబ్బులు పోగొట్టుకున్న అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటను ఉదహరించారు. క్రికెట్ వినోదం కోసమే చూడాలే తప్ప బెట్టింగ్‌ల వైపు మొగ్గు చూపకూడదన్నారు. తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడితే వారికి నచ్చజెప్పి ఆ ఊబిలోనుంచి బయటకు తీసుకురావాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు.

అనుమానితులపై నిఘా

పార్వతీపురం జిల్లా వ్యాప్తంగా గతంలో బెట్టింగ్‌లకు పాల్పడిన వారు, అనుమానితులపై పోలీస్ నిఘా ఉంచామన్నారు. జిల్లాలో ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిస్తే 112/100కు డయల్ చేయాలని లేదా సమీపంలో ఉన్న పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

మన బడి.. మరింత దూరం



- కొన్ని మూసివేత.. మరికొన్ని విలీనం
- విద్యార్థుల తరలింపునకు యోచన
- సర్కారు విద్య నిర్వీర్యానికి కూటమి ప్రభుత్వం కుట్ర
- ఆందోళనకు సిద్ధమవుతున్న యూటీఎఫ్

సాక్షి, పార్వతీపురం మన్యం/సీతానగరం:

పేద విద్యార్థులకు చదువును దూరం చేసి, ప్రభుత్వ పాఠశాలలను విలీనం చేసేందుకు కూటమి ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం.. సర్కారు విద్యకు పెద్దపీట వేసి, నాడు-నాడుతో పాఠశాలల రూపురేఖలు మార్చి, విప్లవాత్మక విద్యా సంస్కరణలతో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తే... ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని అనేక ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూసివేసేందుకు, మరోచోట విలీనం చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కొద్దిరోజులుగా విద్యార్థుల తల్లిదండ్రులు చేస్తున్న ఆందోళనలను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. విద్యాహక్కు చట్టాన్ని కాలరాస్తూ.. విద్యార్థులను ఊరికి దూరంగా ఉండే పాఠశాలలకు పంపించే ఏర్పాట్లను చేస్తోంది. పాఠశాలలను ఫౌండేషన్ (1, 2 తరగతులు), బేసిక్ ప్రైమరీ (1-5 తరగతులు), మోడల్ ప్రైమరీ (తరగతికి ఒక టీచర్ ఉంటారు. ఐదు తరగతులు ఉంటాయి), హైస్కూల్‌గా విభజిస్తున్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేస్తామంటూనే.. పక్కనున్న ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న నెపంతో 3, 4, 5 తరగతులను అందులోకి విలీనం చేస్తున్నారు. ఈ విధంగా మండలానికి 7 నుంచి 10 స్కూళ్ల వరకు ప్రభావితం అవుతున్నాయి. ఇక్కడ 1, 2 తరగతులు మాత్రమే ఉండగా.. భవిష్యత్తులో అక్కడికి కొత్తగా ఇంకెవరూ చేరరని, తద్వారా పూర్తిగా ఆయా పాఠశాలలను మూసివేయడమే దీని వెనుక ప్రభుత్వ ఉద్దేశమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.



బళ్లకృష్ణాపురం పాఠశాల

సీతానగరం మండలంలోని బల్ల కృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ పాఠశాలను ఎత్తివేసి, గెడ్డలుప్పి యూపీ పాఠశాలలో విలీనం చేయనున్నారు. ఈ పాఠశాలకు వెళ్లాలంటే రాష్ట్రీయ రహదారి, సువర్ణముఖి నది దాటాల్సి ఉంటుంది. సుమారు కిలోమీటరు దూరం విద్యార్థులు నడిచి వెళ్లాలి. పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. సీతానగరం బగ్గందొరవలస ప్రాథమిక పాఠశాలలో 16 మంది విద్యార్థులు చదువుతుండగా.. ప్రభుత్వ విధానం వల్ల వీరు కూడా గెడ్డలుప్పి వెళ్లి చదువుకోవాల్సి ఉంటుంది. రామవరంలోని పాఠశాల ఆర్.వెంకంపేటలో విలీనం కానుంది. ఇక్కడికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల ప్రయాణం. మధ్యలో పెద్ద చెరువు ఉంది. శ్మశాన వాటికను దాటుకుని వెళ్లాలి. ఒక్క సీతానగరం మండలంలోనే 20 పాఠశాలలు విలీనం కానున్నాయి. వాస్తవానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు-నాడు పథకం కింద పాఠశాలల భవనాలను సుందరంగా తీర్చిదిద్దింది. ప్రహరీలు, మొక్కల పెంపకం, రంగురంగుల టేబుళ్లు, ఆహ్లాదకర వాతావరణంలో పాఠశాలలు నడుస్తున్నాయి. వాటిని నిరుపయోగంగా వదిలేయడంతో పాటు.. ఊరి బడి దూరం కానుందని తెలియడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తమ పిల్లల చదువు ఏం కావాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పార్వతీపురం మండలంలోని పెదమరికి, జమదల, పుట్టూరు, కృష్ణపల్లి, కోరి, అడ్డాపుశీల, కోటవానివలస, సంగంవలస.. ఇలా ఎనిమిది చోట్ల 6,7,8 తరగతులున్న యూపీ పాఠశాలు మరోచోట హైస్కూల్‌కు విలీనం కానున్నాయి. చినమరికి పాఠశాలలో 3, 4, 5 తరగతులను పెదమరికిలో కలుపుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ 1, 2 తరగతులే ఉంచగా.. వచ్చే విద్యాసంవత్సరానికి ఈ పాఠశాలలో కొత్తగా విద్యార్థులను ఎవరు చేర్చుతారని.. తద్వారా పిల్లలు లేరన్న నెపంతో పాఠశాలను ఎత్తివేస్తారని ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.

ఊరికి దూరంగా బడి...

ప్రైమరీ పాఠశాలలు.. కొన్ని గ్రామాలకు దూరం కానున్నాయి. చిన్నపిల్లలు చదువుకోసం రెండు, మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అంత దూరం తమ పిల్లలను ఎలా పంపగలమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక.. యూపీ పాఠశాలలకు చరమగీతం పాడి, 6, 7, 8 తరగతులను సమీపంలోని హైస్కూల్లోకి విలీనం చేస్తున్నారు. జిల్లాలో ఈ విధంగా 110 వరకు పాఠశాలలు ప్రభావితం అవుతున్నాయి. కొన్నింటిని తరలించడం, మరికొన్నింటిని విలీనం చేయడం వల్ల తమ విద్యార్థులు చదువుకు దూరమవుతారని, ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఇప్పటికే భామిని, పాలకొండ, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి పిల్లల తల్లిదండ్రులు పలుమార్లు ధర్నాలు నిర్వహించారు. కలెక్టరేట్‌కు వచ్చి అధికారులకు అర్జీలిచ్చారు. అవన్నీ బుట్టదాఖలే అయ్యాయి. విలీనం దిశగానే విద్యాశాఖ అధికారులు ముందుకు వెళ్తున్నారు.

పోరాటానికి సిద్ధమవుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు యూటీఎఫ్ వంటి ఉపాధ్యాయ సంఘాలు పోరాటానికి సిద్ధమవుతున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి 'మన ఊరి బడిని కాపాడుకుందాం' నినాదంతో ఇప్పటికే ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఈ నెల 25న జిల్లా కేంద్రంలో డీఈవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగి రాకుంటే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని యూటీఎఫ్ నాయకులు చెబుతున్నారు.

ఉద్యమం తీవ్రతరం



ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. పిల్లల తల్లిదండ్రులతో కలసి పోరాటానికి సిద్ధమయ్యాం. యూపీ పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలి. ప్రాథమిక పాఠశాలల నుంచి విద్యార్థులను విలీనం చేయవద్దు. పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ పాఠశాల పెట్టాలి. ఎల్‌కేజీ, యూకేజీ పెడితే విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెరుగుతుంది. సమాంతర మీడియం ఉండాలి. ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంత వరకు ఉద్యమం కొనసాగుతుంది.

– ఎస్.మురళీమోహనరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

పిల్లలను ఎలా చదివించగలం?



మా పాప వాసంతి బళ్ల కృష్ణాపురంలో ఐదో తరగతి చదువుతోంది. ఇప్పుడు దూరంలో ఉన్న మరో పాఠశాలకు పంపాలంటున్నారు. మా ఊరిలోని బడిని వదిలి, అంత దూరం పంపించాలంటే సాధ్యమేనా? చిన్న పిల్లలు రహదారులు, నదులు దాటి ఎలా వెళ్లగలరు.

– పెద్దింటి సత్యవతి, బళ్లకృష్ణాపురం, సీతానగరం మండలం

క్లుప్తంగా

పదవ తరగతి మ్యాథ్స్ పరీక్షకు 56 మంది గైర్హాజరు

పార్వతీపురంటౌన్: పదవ తరగతి మ్యాథ్స్ పరీక్షకు 56 మంది గైర్హాజరయ్యారని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 67 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మ్యాథ్స్ పరీక్షను జిల్లా వ్యాప్తంగా 10,405 మంది రాయాల్సి ఉండగా 10,349 మంది విద్యార్థులు హాజరయ్యారని, 56 మంది గైర్హాజరయ్యారన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష సజావుగా నిర్వహించామని, 31 పరీక్షా కేంద్రాల్లో వర్యవేక్షక బృందాలు, 6 కేంద్రాల్లో తాను సందర్శించినట్లు తెలిపారు.

బాలల న్యాయమండలి సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో బాలల సంక్షేమ సమితి, బాలల న్యాయమండలిలో సభ్యుల నియామకానికి అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అదనపు జిల్లా పర్యవేక్షణాధికారి బీవీ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత ఉండి ఆసక్తిగల అభ్యర్థులు హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడీసీడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తును పొంది ఏప్రిల్ 9లోగా డైరెక్టర్, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ, విజయవాడకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 91000 45398 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎస్‌జీటీ పరీక్షకు ఉచిత శిక్షణ

పార్వతీపురం: ఎస్‌జీటీ పరీక్షకు అర్హులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వెనుకబడిన తరగతులు, బలహీన వర్గాల అభ్యర్థులకు డీఎస్సీలో ఎస్‌జీటీ పరీక్షకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణకు దరఖాస్తు చేసే అభ్యర్థులు డిగ్రీ, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, టెట్ మార్క్స్ జిరాక్స్, రెండు ఫొటోలతో దరఖాస్తు చేయాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయానికి సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9701786751, 9700112711 నంబర్లలో సమర్పించాలని సూచించారు.

విగ్రహాల ధ్వంసంపై కేసు నమోదు

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలోని నిర్మాణం జరుగుతున్న సీతారామ ఆలయంలో దుర్గాదేవి, గరుత్మంతుడి విగ్రహాల కాళ్లు, చేతులు ధ్వంసం చేసిన సంఘటనలో ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు ఈ ధ్వంసానికి సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నామని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని పట్టుకునే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురంటౌన్: పట్టణంలో గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పార్వతీనగర్ కాలనీకి చెందిన తరుణ్ ప్రేమ వివాదంలో అమ్మాయి మాట్లాడడం లేదని మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న గడ్డిమమందు సోమవారం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పార్వతీపురంలో ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి మోసం చేసిన కేసులో నెల్లిమర్ల మండలం తమ్మాపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ తమ్మాపురం గ్రామానికి చెందిన గవిడి శ్రీనివాసరావు విశాఖకు చెందిన పైడి అమ్మినాయుడికి తప్పుడు పత్రాలతో 2022లో రూ.8.36 లక్షలకు కొంత భూమిని విక్రయించాడని తెలిపారు. తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఆర్థిక నష్టం కలిగించినట్లు బాధితుడు అమ్మినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. దర్యాప్తులో తగిన సాక్ష్యాలు లభించడంతో ఆరోపణలు నిజమని తేలిందని తమ్మాపురంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

కూటమి నాయకుల గలాటా

- మండల సమావేశంలో ఉద్రిక్తం
- ఎమ్మెల్సీని సమావేశానికి రానీయకుండా కూటమి ఎత్తులు
- సుమారు మూడు గంటల పాటు నాటకీయ పరిణామాలు



అధికారుల తీరుపై విలేకరుల సమావేశంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విక్రాంత్, సభ్యులు

పాలకొండ: కూటమి నాయకుల నక్కజిత్తుల ఎత్తులతో పాలకొండ మండల సర్వసభ్య సమావేశం సోమవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జీవోలను కాదని వారు చెప్పిన విధంగా సమావేశం నిర్వహించేలా అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో గందరగోళంగా మారింది. పోలీసులు, అధికారులు కూటమి నాయకుల చేష్టలను చూస్తూ చేష్టలుడిగి ఉండాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే..సోమవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు ఆహ్వానం పంపలేదు. అయినప్పటికీ జీవో నంబర్ 44 ప్రకారం తాను సమావేశానికి వెళ్లే హక్కు ఉందంటూ ఎమ్మెల్సీ విక్రాంత్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు సమావేశ మందిరానికి ఉదయం 11 గంటలకు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని కింద ఎంపీపీ గదిలో కూర్చున్నారు. కూటమికి చెందిన సభ్యులు అక్కడే కూర్చుని ఎమ్మెల్సీ విక్రాంత్‌ను సమావేశ మందిరం నుంచి పంపిచేస్తేనే తాము ఆ సమావేశానికి వస్తామని ఎంపీడీవోకు తెలిపారు. దీంతో ఎంపీడీవో విజయరంగారావు ఎమ్మెల్సీ విక్రాంత్‌ను సమావేశ మందిరం నుంచి బయటకు వెళ్లిపోవాలని కోరారు. దీనిపై విక్రాంత్ స్పందిస్తూ జీవో 44 ప్రకారం తాను సమావేశానికి రావడానికి హక్కు ఉందని తాను సమావేశంలో ఉంటానని పట్టుబట్టారు. ఎంపీడీవో పోలీసుల ద్వారా విక్రాంత్‌ను బయకు పంపించేందుకు ప్రయత్నించడంతో అక్కడ గందరగోళం నెలకొంది. మండలంలోని ఇతర ప్రాంతాల నుంచి సమావేశ మందిరానికి చేరుకున్న కూటమి నాయకులు అరుపులు, కేకలు వేస్తూ కవ్వింపు చర్యలకు దిగారు. సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తిలు విక్రాంత్‌ను సమావేశం నుంచి వెళ్లిపోవాలని కోరారు. దీనిపై విక్రాంత్ మాట్లాడుతూ జీవో 44 చెల్లదని ఎంపీడీవో రాతపూర్వకంగా ఇస్తే వెళ్లిపోతానని స్పష్టం చేశారు. దీంతో ఎంపీడీవో పంచాయతీరాజ్ చట్టం మేరకు జీవో 44 చెల్లదని విక్రాంత్‌కు నోటీసు అందించారు. అనంతరం ఎమ్మెల్సీ విక్రాంత్, తమ సభ్యులతో పాటు 2.30 గంటలకు బయటకు వెళ్లిపోయారు.



ఎమ్మెల్సీ విక్రాంత్‌కు సభ నుంచి బయటకు వెళ్లిపోవాలని నోటీసు ఇస్తున్న ఎంపీడీవో



సమావేశ మందిరంలో కూటమి నాయకులు

మండలిలో ఫిర్యాదు చేస్తా: ఎమ్మెల్సీ విక్రాంత్

ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశానికి తనను హాజరుకాకుండా అవమానపరిచిన సంఘటనపై ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తీవ్రంగా స్పందించారు. మండల అభివృద్ధి కోసం తగిన సూచనలు సలహాలు అందించాలని, ఈ ప్రాంత రైతుల సమస్యలపై చర్చించాలని తాను సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గి జీవో44ను విస్మరించారని విమర్శించారు. దీనిపై తాను శాసన మండలి చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తానని, న్యాయపరంగా పోరాటం చేస్తానని తెలిపారు.

ఏక పక్షంగా సమావేశం..

మండల సమావేశం సోమవారం మధ్యాహ్నం నుంచి కూటమి నాయకులతో అధికారులు ఏకపక్షంగా కొనసాగించారు. వాస్తవానికి మండలంలో 12 మంది ఎంపీటీసీలు ఉంటే వారిలో 10మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలే. వారిలో నలుగురు ఎంపీటీసీలను ఇటీవల కూటమి నేతలు తమ పార్టీలో చేర్చుకున్నారు. అప్పటికీ ఇరుపార్టీలకు 6 చొప్పున ఎంపీటీసీలు ఉన్నారు. ఇక సర్పంచ్‌ల విషయంలో 33 పంచాయతీలకు 25 పంచాయతీల్లో వైఎస్సార్ మద్దతు దారులే సర్పంచ్‌లుగా ఉన్నారు. ఎమ్మెల్సీ విక్రాంత్‌తో పాటు వారంతా వెళ్లిపోవడంతో ఉన్న కూటమి మద్దతు దారులతోనే సమావేశం పూర్తిచేశారు.

క్షయ రహిత భారత్‌కు సహకరించండి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: క్షయ రహిత భారత్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2025 నాటికి క్షయ వ్యాధిని అంతం చేసే దిశగా ప్రయత్నం చేస్తున్నామన్నారు. క్షయ రోగులు అందరూ పూర్తి కాలం మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. క్షయ వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న కఫం పరీక్ష కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వైద్యసిబ్బందికి ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేశారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, ఎన్‌సీడీపీఓ డాక్టర్ సుబ్రమ్మణ్యం, డీఎంఓ మణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 275 అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న జేసీ సేతుమాధవన్



ఫిర్యాదులు వింటున్న ఎస్పీ వకుల్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 275 వినతులు అందాయి. అత్యధికంగా రెవెన్యూ శాఖకు 117, దేవాదాయ శాఖకు 46, పోలీస్‌శాఖకు 31, డీఆర్‌డీఏకు 19, జిల్లా పంచాయతీ రాజ్ శాఖకు 10, విద్యుత్ పంపిణీ సంస్థకు 5, వైద్యారోగ్యశాఖకు ఐదు, పాఠశాల విద్యాశాఖకు 4 చొప్పున వినతులు అందగా మిగిలినవి ఇతర శాఖలకు చెందినవిగా నమోదయ్యాయి. వినతులను జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్లు మురళి, ప్రమీలా గాంధీ స్వీకరించారు.

ఎస్పీ గ్రీవెన్స్ సెల్‌కు 42 ఫిర్యాదులు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, పరిష్కరించేందుకు ఎస్పీ వకుల్ జిందల్ 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎస్పీవకుల్ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. ఈ పీజీఆర్‌ఎస్‌లో మొత్తం 42 ఫిర్యాదులు ఆయన స్వీకరించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించి 15, కుటుంబ కలహాలకు సంబంధించి 4, మోసాలకు పాల్పడినట్లు 8, ఇతర అంశాలపై 15 ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డీసీఆర్బీ సీఐ శంకర్రావు, ఎస్బీ సీఐలు పాల్గొన్నారు.

మూడు రిజిస్ట్రేషన్లు..ఆరు స్టాంపులు..!

- యథేచ్ఛగా స్టాంపు వెండర్ల దోపిడీ
- ఇ-స్టాంప్‌లపై అక్రమంగా వసూలు
- సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో మాన్యువల్ స్టాంప్‌లకు బ్రేక్
- సిండికేట్‌గా మారిన విక్రయదారులు



రాజాం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం



ఇ-స్టాంప్‌లు

రాజాం: ఆస్తుల లావాదేవీలు, ప్రాపర్టీ సేల్ డీడ్‌లు, లీజు ఒప్పందాలు, పార్టనర్‌షిప్ డీల్‌లు, పవర్ ఆఫ్ అటార్నీ డాక్యుమెంట్లు, అఫిడవిట్‌లతో పాటు అనేక రకాలైన చట్టపరమైన ఒప్పందాలకు ప్రధాన ఆధారమైన నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పత్రాల విక్రయాల్లో దోపిడీ పెరిగింది. రాజాం పట్టణంలో కొంతకాలంగా ఇ-స్టాంప్ పత్రాల విక్రయాలు పెరిగాయి. మూడునెలలుగా రాజాం సబ్ రిజిస్టార్ కార్యాలయంలో మాన్యువల్ నాన్ జ్యుడిషియల్ పత్రాల విక్రయం నిలిపివేశారు. దీంతో ఇ-స్టాంప్ పత్రాలనే దండిగా వినియోగిస్తున్నారు. ఫలితంగా విక్రయదారులు వాటి ధరలు అమాంతం పెంచేశారు. హద్దూ అదుపులేకుండా దోపిడీకి తెరతీశారు. వారికి సబ్‌రిజిస్టార్ కార్యాలయం అండగా ఉండడంతో ఈ దోపిడీ యథేచ్ఛగా కొనసాగుతోంది.

అక్రమ వసూళ్లు అధికం

గతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రూ.10లు, రూ.20, రూ. 50, రూ.100 నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పత్రాలు అధికంగా లభించేవి. వాటికి రూ.10 కమీషన్ వసూలు చేయడం, లేదంటే వాస్తవ ధరకు విక్రయించే వారు. ఇ-స్టాంప్ పత్రాల వినియోగం వచ్చిన తరువాత రాజాంతో పాటు చుట్టు పక్కల పలుగ్రామాలకు చెందిన రైటర్లు తమ కుటుంబీకుల ద్వారా స్టాంప్ వెండర్ లైసెన్సులు పొందారు. వారంతా సిండికేట్‌గా మారి ఇ-స్టాంప్ పత్రాల విక్రయాల్లో అధిక ధరలకు ప్రారంభించారు. రూ.10 నుంచి రూ.50 స్టాంప్ పత్రాలకు అసలు ధరకు రూ.30 కలిపి వసూలు చేస్తున్నారు. రూ.10 స్టాంప్ పత్రాలు కావాలంటే రూ.40 చెల్లించాల్సిన పరిస్థితి కొనుగోలు దారులకు వస్తోంది. వాటిపై ఎక్కువగా ఫిర్యాదులు, ప్రశ్నలు అధికమవడంతో రూ.10, రూ.20లు స్టాంప్ పత్రాల విక్రయాలు పూర్తిగా నిలుపుదలచేశారు. రూ.50 ఇ-స్టాంప్ పత్రాలకు రూ.30లు అక్రమంగా కలిపి రూ.80, రూ.100 స్టాంప్ పత్రాలకు రూ.50 కలిపి రూ.150కు విక్రయిస్తున్నారు. వాస్తవంగా ప్రతి ఇ-స్టాంప్ పత్రం విక్రయానికి రిజిస్ట్రేషన్ల సంస్థ నుంచి రూ.10కు రూ.1.50లు చొప్పున కమీషన్ వస్తుంది. ఈ కమీషన్ చాలదనే ఆలోచనతో బయట కమీషన్లు అధికమయ్యాయి. ఇవేకాకుండా ప్రింటర్‌కు పెట్టుబడి రూపంలో స్టాంప్‌లపై అధిక ధరలు వసూలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు.

రూ.30లు అధికం

రాజాంలో ఈ స్టాంప్ పత్రాల విక్రయంలో అధికంగా వసూలు జరుగుతోంది. ఇటీవల రూ.50లు స్టాంప్ పత్రం నిమిత్తం వెళ్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేదు. ఆ ఇ-స్టాంప్ బయట వెండర్ వద్ద తీసుకుంటే రూ.30లు అదనంగా వసూలు చేశారు.

– ఏపీ అర్జున్, డోలపేట, రాజాం

చాలా ఇబ్బందిగా ఉంది.

ఈ స్టాంప్ పత్రాలు అధికంగా నోటరీలకు అవసరమతుతాయి. నోటరీ అఫిడవిట్ నిమిత్తం ఇచ్చే డబ్బుల కంటే ఈ స్టాంప్‌లకు అధికంగా ఇవ్వాల్సి వస్తోంది. రూ.30 వరకూ ప్రతి చిన్న స్టాంప్ పత్రంపై కూడా వసూలు చేస్తున్నారు.

– ఎస్.వెంకటరావు, రేగిడి మండలం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిలుపుదల

రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సేవలపై ఇటీవల సోషల్ మీడియాతో పాటు పలు సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు అధికమవుతున్నాయి. వాటికి రుజువుగా ఇప్పుడు ఇ-స్టాంప్ పత్రాల విక్రయాల్లో అక్రమవసూళ్లు ఈ కార్యాలయానికి ముడిపడి జరుగుతున్నాయనే వాదన వినిపిస్తోంది. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కొరత లేకుండా నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పత్రాలు ఉంటాయి. రాజాం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గత కొంత కాలంగా వాటి విక్రయాలు నిలిపివేశారు. భూముల రిజిస్ట్రేషన్లతో పాటు పెళ్లిళ్లు, ఇతర ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఒప్పందాలు అన్నింటికి ఇ-స్టాంప్ పత్రాలనే కార్యాలయం కోరుతోంది. ఇటీవల అఫిడవిట్ నోటరీ విధానం ఎక్కువ కావడంతో వాటికి ఇ-స్టాంప్ పత్రాల అవసరం అధికమైంది. ఫలితంగా ఇ-స్టాంప్ విక్రయాల్లో అధికంగా వసూళ్లు పెరిగాయి. రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద మాన్యువల్ పత్రాలు ఉంటే ఈ ఇబ్బంది తప్పేదని పలువురు వాపోతున్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- పీజీఆర్‌ఎస్‌కు 98 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ శోభిక



ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి



వినతులు స్వీకరిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పార్వతీపురంటౌన్: ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం ఆమె పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్‌ఓ కె.హేమలత, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ పి.రామచంద్రారెడ్డిలతో కలిసి 98 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ ద్వారా అందిన అర్జీలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎటువంటి అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగురాలైన పాలకొండ మండలానికి చెందిన సుందరగిరి శ్రీజా భవానీ తనకు టచ్‌ఫోన్ కావాలని ఇదివరకే వినతిపత్రాన్ని అందజేయడంతో ఆమెకు టచ్‌ఫోన్ అందజేశారు.

పీజీఆర్‌ఎస్‌లో అందించిన కొన్ని అర్జీలు

- జియ్యమ్మవలస మండలం గడసింగుపురం నుంచి పి. తాతబాబు తదితరులు తమ గ్రామంలోని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ పనికిరానివారి పేర్లతో అక్రమాలకు పాల్పడడమే కాకుండా ఒక్కో వేతన దారు నుంచి రూ.200 చొప్పున అవినీతికి పాల్పడుతున్నారని, దానిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు.
- పార్వతీపురం మండలం డోకిశీల గ్రామంలో గల పొలాలకు ఆధారమైన పంటకాలువ పూర్తిగా కబ్జాకు గురైందని, ఆ కాలువ ద్వారా 200 ఎకరాల్లో సాగుభూములు, 15 చెరువులు ఆధారపడి ఉన్నాయన్నారు. కబ్జాతో రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని, కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని కోరారు.
- కురుపాం మండలం రెల్లిగూడ గ్రామానికి గతంలో నిర్మించిన గ్రావెల్ రోడ్డు పూర్తిగా పాడైనందున తమ గ్రామాలకు అంబులెన్స్, రేషన్ వాహనం రావడం లేదని, రోడ్డు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ బి.అరుణ గ్రామస్తులతో కలిసి అర్జీ చేశారు.
- పాలకొండ మండలం బుక్కురుపేట గ్రామానికి చెందిన సంధ్యారాణి పెండింగ్‌లో ఉన్న తన ఇంటి బిల్లును మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

సమస్యలపై విచారణ చేసి న్యాయం

పార్వతీపురం రూరల్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి అలసత్వం చేయకుండా విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసుశాఖ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారుల నుంచి అర్జీలను స్వీకరించారు. వారితో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సోమవారం వచ్చిన 13 ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రుల వేధింపులు, వరకట్న వేధింపులు, భూ ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీ వసూళ్లు, ప్రేమపేరుతో మోసం వంటి ఫిర్యాదులు ఉన్నాయి. ఈ మేరకు వచ్చిన సమస్యల పరిష్కారానికి సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్ ద్వారా మాట్లాడి ఆయా సమస్యలను, వాటి పూర్వాపరాలను పరిశీలించి వాస్తవాలైతే చట్టపరిధిలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు.

పీజీఆర్‌ఎస్‌కు 40 వినతులు

సీతంపేట: సీతంపేట ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 40 వినతులు వచ్చాయి. పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి వినతులు స్వీకరించారు. బర్నగ్రామానికి రేషన్ బియ్యం పంపిణీ చేయాలని ఎ.చిన్నారావు, సీసీర హదారి మంజూరు చేయాలని ఈతమానుగూడకు చెందిన రాజేష్ అర్జీలు అందజేశారు. మంచినీటి సదుపాయం కల్పించాలని కుశిమి బంగారుగూడ గిరిజనులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఈఈ రమాదేవి, ఏపీడీ సన్యాసిరావు, డీఈ మధుసూదనరావు, సీడీపీఓ రంగ లక్ష్మి పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా సులభంగా కేసుల పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి కల్యాణచక్రవర్తి



రెండు జిల్లాల మీడియేషన్ ట్రైయినింగ్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి బి.సాయికల్యాణ్ చక్రవర్తి

విజయనగరం లీగల్: మధ్యవర్తిత్వంలోని మెలకువలను నేర్చుకోవడం ద్వారా కేసులను చాలా సులభంగా పరిష్కరించవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణచక్రవర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం 40 గంటల మీడియేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో నిర్వహించిన శిక్షణలో న్యాయవాదులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మధ్యవర్తిత్వంలో భాగంగా శిక్షణ ఇవ్వడానికి తమిళనాడు రాష్ట్రానికి చెందిన రత్నతార, కేరళ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సిరాజ్ ఎంపికైన న్యాయవాదులకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ ట్రైనింగ్ ప్రోగ్రాంలో వ్యాజ్యాలను మానవతా దృక్పథంతో పరిశీలించి ఉభయ పార్టీల ద్వారానే పరిష్కారం రాబట్టాలని న్యాయవాదులకు సూచించారు. ఈ మధ్యవర్తిత్వం వల్ల ఉభయ పార్టీలకు సమయం డబ్బు వృథా కాకుండా ఉంటాయని, అదేవిధంగా కోర్టులో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం చూపవచ్చన్నారు. వ్యాజ్యాల పరిష్కారానికి రాజీ కూడా ఒక మార్గమేనని ఆయన స్పష్టం చేశారు. శిక్షణ పొందుతున్న ఉమ్మడి జిల్లాల న్యాయవాదులను శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. శిక్షణను అందిస్తున్న మాస్టర్ ట్రైనీస్‌తో మాట్లాడి శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. సమావేశంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



జెడ్పీ చైర్మన్ చిన్న కుమారుడు ప్రణీత్ బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

విజయనగరం: జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. ఇటీవల జెడ్పీ చైర్మన్ చిన్న కుమారుడు మృతిచెందిన నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు మృతిచెందిన ప్రణీత్ బాబు చిత్రపటం వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, తుని మాజీ శాసనసభ్యుడు జక్కంపూడి రాజా, పాలకొండ మాజీ ఎమ్మెల్యే తలేభద్రయ్య, ప్రస్తుత కూటమి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు, మాజీ స్మార్ట్ సిటీ చైర్మన్ జీవీ వెంకటేశ్వరరావు, మాజీ వుడా చైర్మన్ రవిరాజు, వివిధ మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు పంచాయతీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ చైర్మన్లు, మాజీ డైరెక్టర్లు పరామర్శించిన వారిలో ఉన్నారు.

చికిత్స పొందుతూ కారు డ్రైవర్ మృతి

భోగాపురం: తగరపువలసలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తీగల నానికుమార్(22) అనే కారు డ్రైవర్ సోమవారం ఉదయం మృతి చెందాడు. దీనిపై పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పాలకొండ ప్రాంతానికి చెందిన నానికుమార్ కారు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. కారు బేరం ఉందని తల్లికి చెప్పి సోమవారం ఉదయం వేకువజామున విశాఖపట్నం బయలుదేరాడు. ఈ క్రమంలో భోగాపురం జాతీయ రహదారి (ఎస్‌బీఐ సమీపం) వద్దకు చేరుకునేసరికి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని తగరపువలస ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి అన్నయ్య తీగల నవీన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.